# సొంతగూడు



కొండవీటి సత్యవతి

"కర్మణ్యే వాధి కారస్తే.." కంఠతావచ్చిన శ్లోకం పుస్తకంలోని అక్షరాలు కనబడక పోయినప్పటికీ చదివేయగలిగింది సుందరమ్మ. దాని వ్యాఖ్యానం చదవబోయేసరికి, రెండు మూడుసార్లు కళ్ళజోడు సవరించుకున్నప్పటికీ.. కుదరలేదు. సదుంపేకి, కళ్ళుమండి, విసుగెత్తి, తలెత్తి చూసింది.

బోధపడింది!

మొదలే చీకటి కొంపలాఉండే అద్దె ఇల్లు. నల్లటి మబ్బులు కమ్మేసిన ఆకాశం వల్ల మరింత కారుచీకటైంది పుస్తకం మూసేసింది.

అప్పటికి గుర్తొచ్చి గాభరా పుట్టింది సుందరమ్మకి

వరండా గుమ్మం దగ్గిర కూచున్న సుందరమ్మ లోపల గదిలో ఓ మూల వంట చేస్తున్న కోడల్ని చూస్తూ... "అమ్మాజీ చిన్నాడింకా రాలేదేం." అంది.

"అదే నేనూ చూస్తున్నానత్తయ్యా.." అంది కోడలు.

పొద్దుటనగా వెళ్ళేడు. ఇంకా రాలేదు వెళ్ళిన పనేవయ్యిందో! ఏమవుతుంది... ఇలా మబ్బుల్తో దేవుడే దండెత్తి వచ్చేస్తే బక్కవాళ్ళ బతుకులేమవుతాయి...? ఎంత మన కర్మ మనం చేసుకుపోదామనుకున్నా... చెయ్యనిస్తాడా? ఇన్నేళ్ళకిన్ని తరాలకింత నీడ దొరకబోతున్నందు కెంత సంతోషించింది!

ఓసారి చూరుకిందికి వచ్చి తలెత్తి చూసింది సుందరమ్మ. పూల జల్లులా మెత్త మెత్తగా కురుస్తోంది. ఇంకా ముఖం దించనైనా దించలేదు. హోరుమంది. ఆ వెంటనే జోరుగా కురవడం మొదలైంది.

మళ్ళా చిన్నాడు కళ్ళల్లో మెదిలేడు.

చిన్నాడికి చిన్నతనంలోనే భుజాలు బరువుతో కాయలు కాసేయి. బాధ్యత తెలిసినవాడు బాధ్యతలనుండి తప్పుకోలేదు – తప్పించుకోడు. తన గురించికన్నా తనవారి గురించే కష్టపడతాడు. అందుకె వాడిగురించి అంత తపన.

ఇంతలోనే అంతదూరంలో వస్తూ కనిపించేడు. తడుచు కుంటూ వచ్చి తుడుచు కుంటూ వాకిట్లో నిలబడ్డాడు.

"తడుచు కుంటూ రాకపోతే ఎక్కడైనా కాసేపు నిలబడ లేకపోయావురా చిన్నాడా?" అంది తువ్వాలందిస్తూ సుందరమ్మ.

"ఫర్లేదులేమ్మా.. ఆకలేస్తోందంటుకని వచ్చేసేను..." అన్నాడు నెమ్మదిగా.

కడుపు చెరువైపోయింది సుందరమ్మకి.

"అమ్మాజీ ..చిన్నాడికి తొందరగా అన్నం పెట్టమ్మా." అంటూ కోడలికో కేకవేసి.

అప్పటికి చిరు చిరు చినుకులు చిమ్ముతున్నాయి. లైటు వేస్తేగాని పట్టపగల్లా

వెలుతు్రరాని ఆ ఇంట్లో చిన్నాడి చేతికి పెద్దరికం వచ్చిందగ్గర నుండి వుంటోంది.

అదే ఆలోచిస్తూ...అడపాదడపా తుప్పర్లు తుళ్లు తున్నప్పటికీ వరండాలోనే కూర్చుంది సుందరమ్మ. "వర్షం పడుతుంటే అక్కడెందుకమ్మా... లోపలికి వచ్చెయ్యగూడదు..." అని భోంచేస్తూనే కేక పెట్టేడు చిన్నాడు

అది మామూలే, సాడేముప్పాతిక గదిలో మొగుడూ పెళ్ళాలు కాక తనొకర్తె కూడానా అనుకుంటుంది సుందరమ్మ. కొడుకూ, కోడలూ తమతో పాటే పెద్దావిడకూడాను అనుకుంటారు.

"ఫర్వాలేదుగా్రనా . ఇవాళ ఇంటి పని నవ్యంగా జరిగిందా..." అని టాపిక్ మార్చింది సుందరమ్మ.

"ఆఁ ఆఁ జరిగినట్టే రేపొద్దున్న చూస్తేగాని చెప్పలేం..." అన్నాడు

"చిన్నాడికి మంచి నీళ్లియ్యి తల్లీ..." లోపలికి తొంగి చూడకుండానే అతని అవసరం గుర్తించి కేకపెట్టింది.

వర్షం కాస్త నిమ్మళించగానే తానూ ఎంగిలి పడి వరండాలో మంచం వాల్చుకుని మేను వాల్చింది ఉండి ఉండీ జల్లు కురుస్తుంటే అప్పుడూ అప్పుడూగా ఆలోచనలు కళ్లలో గుమ్మరిస్తుంటే నిద్రపట్టేలా లేదు సుందరమ్మకి.

---

ఇటీవల విజయవాడలో ప్రముఖ రచయిత, పత్రికా రచయిత శ్రీ జె. నరేంద్రదేవ్‌కి జార్జి డిమిట్రోవ్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా చేసిన కృషికి బల్గేరియా ప్రభుత్వం తరఫున "జార్జి డిమిట్రోవ్ స్వర్ణ పతకం" బహూకరిస్తున్న బల్గేరియా సాంస్కృతిక విభాగం (న్యూఢిల్లీ) డైరెక్టర్ శ్రీమతి ఇ కమోవాని చిత్రంలో చూడవచ్చు



# సొంత గూడు

సుందరి పెద్దింట్లోనే పుట్టింది. ముగ్గురన్నదమ్ముల తర్వాత పుట్టి ముద్దుల పట్టిగా పెరిగింది. ఆమె పుట్టినిల్లు—ఇల్లనడానికి వీల్లేదన్నంత పెద్దది ముందూ వెనకా తోట అట్టహాసంగా అందంగా వుండేది. అంత ఇంట్లో చెలరేగి తిరిగినా పదిమంది ఉండే ఆ ఇంటిలో ఒకరికొకరు కన్పించేవారు కారు

వస్తూ వస్తూ ఉన్న జ్ఞానంలో .. పుడుతూ పుడుతూ ఉన్న కోరిక — అటువంటిది కాకపోయినా విశాలమైన ఇంటనే కాలు పెట్టాలన్నది !

దానికి వ్యతిరేకంగా ఆ చిన్నవయసులోనే మరో ఇంట అడుగు పెట్టింది. అది అతి చిన్న ఇరుకు గదుల అద్దె ఇల్లు అప్పుడప్పుడే పురివిప్పుతున్న అంతర్నేత్రంతో పుట్టింటినీ, మెట్టినింటినీ బేరీజు వేయిసాగింది అయితే అత్తింటివారిని తన మనసులో మెదిలే భావాలతో ఏనాడూ చిన్నబుచ్చడం ఇష్టం లేక భర్తవైపే మొగ్గు చూపింది.

అయితే ఇంత పెంకుటిల్లు లంకంతమేడగా ఎదిగినట్టు ఆమె మనసులోని కోరిక ఎదగసాగింది. కాని ఎప్పటికప్పుడు పెరుగుతున్న బాధ్యతలూ, ఖర్చులూ, అప్పులూ చూస్తూ చూస్తూ తిరిగిపోతున్న అవకాశాలను ఆమోదించసాగింది. భర్త హయాంలో కాకపోయినా రామలక్ష్మణుల్లాంటి ఇద్దరు కొడుకులూ తన కోరికను కార్యరూపంలోకి తేలేకపోరని సర్దిచెప్పుకుంది.

అడ్డాలనాడు బిడ్డలు గానీ గడ్డాలొచ్చేక బిడ్డలా అన్న సామెత పెద్దాడు ఋజువు చేస్తే, 'పుత్రుడు' అన్న పదాన్ని సార్థకం చేస్తూ భర్త నుండి బాధ్యతలను వారసత్వంగా పుణికి పుచ్చుకున్నాడు చిన్నాడు. అంచేతనే భర్త పోయేక చిన్నాడి పంచను చేరగలిగింది సుందరమ్మ.

తనకున్న చిరుద్యోగం వల్ల వచ్చే స్వల్పాదాయంతోనే గుట్టుగానే అయినా గట్టిగానే బ్రతుకులాగిస్తున్నాడు చిన్నాడు. జీవితమంతా అద్దెకొంపల్లో బతికీబతికీ, అందులోని కష్టనష్ట అన్నీ జీర్ణించుకుపోయిన సుందరమ్మ చిన్నాడు పడుతున్న సంసారయాతన చూస్తూ తన మనసులోని కోరిక బయటపెట్టలేదు. చీకటి కోణంలాంటి ఒంటిగదీ, బయటి వరండాల అద్దె కొంపనే మహాభాగ్యంగా ఎంచుకుని, కోడలి సాయంతో దాన్నే సుఖవంతంగా తీర్చిదిద్దుకుంది.

పెద్దాడు పెద్ద ఉద్యోగమే చేస్తూ పెద్దగా బతుకుతూన్నప్పటికీ వాడికిలేని అభిమానం తనకుమాత్రం ఎందుకని అభిమానంతో చిన్నాడి ఇంటనే వుండిపోయింది.

ఇప్పుడు ఇన్నాళ్ళకి ఇన్నేళ్ళకి తన కలలు పండే తరుణం వచ్చింది. ఆ వార్త విన్నప్పుడు చిన్నాడికన్నా, కోడలికన్నా ఎక్కువ సంతోషించిన వ్యక్తి సుందరమ్మే.

కో-ఆపరేటివ్ బిల్డింగు సొసైటీలో ఎప్పుడో మెంబరుగాచేరి, దరిమిలా డబ్బుకూడా వాయిదాల రూపంలో కట్టేసిన చిన్నాడికి మూడు వందల చదరపు గజాలస్థలం కేటాయింపు జరిగింది !

"ఏమిటమ్మా ... అంతగా సంతోషిస్తున్నావు గాని...దాని మీద హౌసింగ్ ఫెడరేషను నుండి లోను తీసుకొని కట్టించబోయేసరికి తాతలు దిగి వస్తారు. ." నిరాశగా అన్నాడు చిన్నాడు

"అలాగని వదులుకుంటావ్రటా " అని ఆదుర్దాగా అడిగింది సుందరమ్మ.

"వదులుకోవడమంటే ..తిరిగి అమ్మేసుకుంటే వెయ్యో రెండువేలో లాభం రాకపోదు.. " అన్నాడు

"మనం డబ్బు కట్టడం కట్టినా . అప్పుడూ అప్పుడూ కట్టడం వల్ల ఆట్టే కష్ట పడలేదుకదా ..అంచేత అనుకోకుండా ఒచ్చిన పెన్నిధి కూడాను. కనక అమ్మేయడంలాంటి పిచ్చిపన్లు చెయ్యకుమీ. ."

"మరేం చెయ్యమంటావమ్మా. " అన్నాడు ఏమీ తోచని స్థితిలో చిన్నాడు...

"సొంత గూడు అయ్యుండాలిగాని అద్దె కొంపపాటి చెయ్యద్రటా.. మన తాహతునిబట్టి తాటాకుల్తో ఓ శాల వేసుకుంటే చాలదూ " అంది.

సుందరమ్మ చెప్పిందాంట్లో బేసబబేమీ కన్పించలేదు చిన్నాడికి. అంచేతను వెంటనే ఒప్పుకున్నాడు అప్పటినుండీ రెండు మూడు నెల్లపాటు పొదుపుచేసి, కర్రా కంపా పోగుచేసి పని మొదలెట్టేడు.

ఇవాళ అదే పనిమీద వెళ్ళి మట్టి తొక్కించేడు. మధ్యాహ్నానికి కాస్తంత గోడకూడా లేపేడు. అయితే వర్షం ముంచుకొచ్చింది. ఆరుదల లేకపోవడం మూలాన పచ్చిమీద గోడంతా కరిగిపోతే వృధా ప్రయాసే... ఆ రోజు కూలీ ఖర్చు బూడిదలో పోసిన పన్నీరే ...

అది తల్చుకుంటుంటే మంచంమీద పడుకున్న సుందరమ్మ ప్రాణం గిలగిల్లాడిపోయింది.

మంచం కింద మరచెంబుతో నీళ్ళు పెట్టడానికి వచ్చిన కోడలు ... "అత్తయ్యా... అత్తయ్యా..." అంటూ కేకేసేసరికి లోనుండి పరుగున వచ్చేడు చిన్నాడు.

"ఏంటమ్మా ... ఏవయ్యింది ... అలా మూలిగేవు ... " అన్నాడు ఆదుర్దాగా.

"అబ్బే... ఏం లేదురా గుండెల్లో గాభరాగా వుంది ... అంతే ... " ఒళ్ళంతా నీరు కమ్మేస్తుంటే నింపాదిగా తుడుచుకుంటూ అంది సుందరమ్మ.

"ఉండు ... డాక్టరుని పిలుస్తా ..." అంటూ వెళ్ళబోయేడు చిన్నాడు.

అదికూడా ఎందుకు ... ఈ రోజుకి మరో దండుగా ... అందుకే "వద్దురా. అదే సర్దుకుంటుంది ... అమ్మాజీ కాస్త వేడిగా కాఫీ కలిపి ఇవ్వుచాలు ..." అందివాడి తృప్తి కోసం.

మర్నాడు మళ్ళా ఇంటి పనిమీద బయల్దేరిన చిన్నాడిని ఆపింది సుందరమ్మ.

"ఒరే చిన్నాడా ... ఇంటిపని కొంచెం తొందరగా కానియ్యరా..." అంది ప్రాధేయపడుతున్నట్టుగా.

"ఇదిగో నిన్నటిలా వర్షం అడ్డుపడకుండా వుంటే ఓ వారం పదిరోజుల్లో అయిపోదేంటమ్మా...అయినా ఏవిటేలా అడుగుతున్నావు ?" అన్నాడు అనుమానంగా.

"అబ్బే శ్రావణమాసం దాటిపోకుండా సొంత గూటిలోకి చేరిపోతే బావుంటుంది గదాని..." అంది.

" సర్లే వెళ్ళొస్తానమ్మా " అంటూ వెళ్ళిపోయేడు.

నాలుగైదు రోజులు పని చురుగ్గా అయ్యింది.

రోజులు గడుస్తున్నకొద్దీ సుందరమ్మ ఆత్రుత ఎక్కువయ్యింది. పదిహేనురోజులుగా సెలవు పెట్టిన చిన్నాడు ఎండనక వాననక తిరుగుతున్నాడని ఒకవైపూ, ఇంటిపని ఎప్పటికి పూర్తవుతుందా అని మరోవంకా గింజుకు పోతోంది సుందరమ్మ.

ఆ రోజు ఉదయం కమ్మ నేయించడానికి వెళ్ళేడు చిన్నాడు. అంచేత వాడటు వెళ్ళగానే పంతులుగారిని పిలిపించింది గృహప్రవేశానికి మంచిరోజు చూడ్డానికి.

మూడోరోజున ముహూర్తం పెట్టేడు.

మధ్యాహ్నానికి మండుటెండంతా మటుమాయమైపోయి మేఘాలెత్తుకు వచ్చేయి — మబ్బులు చూస్తుంటే బెంబేలెత్తి పోతోంది సుందరమ్మ.

"మరేంగాభరాలేదత్తయ్యా ... గోడల్లేచిపోయేయి కదా...కమ్మనేతకూడా అయిపోతూంది ...వర్షంవల్ల అడ్డులేదుగాని మీరు నిమ్మళంగా వుండండి..." అంటూనే వుంది కోడలు.

అయినప్పటికి చిటపట చినుకులు రాల్తుంటే గిలగిల్లాడిపోయింది. ఉరుములుండుండి ఉరుముతూంటే మొదలునరికిన చెట్టులా కూలిపోయింది సుందరమ్మ.

అప్పుడే తడుచుకుంటూ ఇంట్లో అడుగు పెట్టిన చిన్నాడు... "అమ్మా" అని పెట్టిన కేకగానీ, "సొంతఇంట అడుగు పెట్టాలంటూ నీ గూడు నువ్వు వెతుక్కున్నావా అమ్మా..." అంటూ చేసిన ఆక్రోశంగానీ సుందరమ్మ విన్పించుకోలేదు. ★



చదివే వారికి; రాసే వారికి
మనవి!
ప్రతి ఉగాదికి
ఆంధ్రపత్రిక
సంవత్సరాది సంచిక
వెలువడుతూ ఉంటుంది!
ఈ సంవత్సరం కూడా ఉగాదికి
ప్రత్యేకంగా సంవత్సరాది సంచిక
వెలువడుతుంది!
అయితే, ఈ ప్రత్యేక సంచిక
ఆంధ్రసచిత్రవారపత్రిక
అనుబంధంగా వెలువడుతుంది!
వివరాల కోసం ఎదురు చూడండి!
తెలుగు పాఠక లోకాన్ని
అన్ని విధాలుగానూ రంజింప చేసే
ఆంధ్రసచిత్రవారపత్రిక
ఉగాది ప్రత్యేక సంచిక కోసం
ఎదురు చూడండి!
కశి